## ౬

పెరికీడు జంక్షన్ దగ్గిర బస్సు కిటకిటలాడుతోంది. బుడమేరు పొంగి చుట్టుపక్కల గ్రామాదుల్ని ముంచేస్తోంది. రెండు రోజులనించీ పెరికీడనించీ గుడివాడకీ గుడివాడనించీ పెరికీడుకీ — రాకపోకలన్నీ బందు. ఆ వేళమాత్రం ఆ బస్సు వొక్కటీ వెడుతోంది అటు.

కండక్ట రొకసైడునా డ్రైవ రొకవంకా నించుని దూది బస్తాలలోకి ఎక్కించినట్టు జనాన్ని శాయశక్తులా బస్సులో కుక్కేస్తున్నారు. బాగా ఫుల్లు అయిం తరవాత అటూ ఇటూ సైడుబోర్డులమీద జనం వేళ్లాడుతో వుంటే వో పెద్దజడలబుట్టలా వుంది బస్సు.

"అబ్బబ్బ - ఎముకలు చూర్ణమై పోతున్నాయి" బస్సుకి మధ్యసీటులో పెద్ద పటకారులో ఇరుక్కున్నట్టు కూచున్న వొక ఆసామీ ఆర్తనాదం.

"ఏమిటీ అన్యాయం ?" బస్సు లోపలికి నెట్టబడే స్టేజిలో వున్న ఓ పేసింజరు కుంటిప్రశ్న.

"ఇంతకీబస్సువాళ్లూ పోలీసులూ వొకటి." వెనక సీట్లో మోచేతుల కుమ్ములాటలో నించీ ఒక రిమార్కు.

ఎన్ని అననీ, ఎక్కినవాళ్లలో గాని, ఎక్కుతున్న వాళ్లలోగాని దిగిపోడానికి సిద్ధంగావున్న స్వాభిమాని ఒక్కడూ లేడు. ఇక ఒక్కమనిషి కాదు గదా అరమనిషినైనా ఇరికించడానికి సాధ్యం కాదని గట్టిగా నమ్మకం చిక్కినతరవాత సూడిగేదెలా స్టార్టయింది బస్సు. అంతలో సబినస్పెక్టరు వొస్తున్నాడంటే వొస్తున్నాడని గుసగుసలు — టకీమంటూ కారు ఆగింది. డ్రయివరు మాసిన కాకి టోపీ సర్దుకున్నాడు. కండక్టరు కాలుస్తున్న సిగరెట్టు పీకి కాలవలోకి నమ్మకంగా గిరాటేసి జనాన్ని గుమ్మడికాయలు దించేసినట్టు దింపుతున్నాడు. పోలీసుసబినస్పెక్టరు గోపాలరావునాయుడు వచ్చే సరికి కండక్టరు టాపు మీదికి చూస్తూ, "సామానంతా దిగినట్టేనా?" అని అజమాయిషీ చేస్తున్నాడు - ఇందాకటి నించీ దిగుతున్న జనమంతా సామాన్లు దింపుకోవటంలో కాలయాపన చేస్తున్నట్టు. సబిన్స్పెక్టరు మఫ్టీలో వున్నాడు. వొచ్చీ రాగానే చెకింగు మాని తిన్నగా వెళ్లి ముందు సీట్లో కూచున్నాడు. వెనకాల చడీచప్పుడూ కాకండా కండక్టరు దిగిపోయినవాళ్లకి ఛార్జీ వాపసుచేస్తున్నాడు.

మెల్లిగా మంచిచేసుకోవాలని కొంతమంది బంకనక్కిరికాయల్లా పట్టుకున్నారు. "ఇవాళ నేను గాని వెళ్ళకపోతే అయిదువందల కరుకులు నష్టమవుతాయి - బాబ్బాబు - పోనిస్తూ." లోపలికి జొరబడాలని చూస్తున్నాడొక షావుకారు. ఇన్స్పెక్టరు తండ్రి తాతల నెవరినైనా ఎరిగివ్రంటే కదిపి, ఆ ప్రస్తావన తెచ్చి, మెల్లిగా చోటుచేసుకుని బస్సు ఎక్కేదామని ఆలోచిస్తున్నాడొక ముక్కుపొడుంశాస్త్రుల్లు. వో పేదరాలు గుండెలు గవుక్కుంటో గబగబా వొచ్చింది. ఖాళీ లేదన్నారు. రోజూ బ్రతిమలాడి ఎక్కించుకునే డ్రైవరు మహాశయుడు ఇవాళ బిర్రబిగిసి మహా నిక్కచ్చిగా వున్నాడు. ఈ గలభా అంతా చూస్తున్న గోపాలరావునాయుడు కండక్టర్ని పిలిచి ఎంతమందిని ఎక్కించావని అడిగాడు.

"ఇరవై ముగ్గురికీ అరటికెట్టయినా అదనంగా లేదు బాబూ."

దిగి లెక్కపెట్టుకుంటున్నాడు. నిలుచున్న ప్యాసింజర్లంతా పక్కకి తొలిగారు. కొత్తగా వొచ్చిన పేదరాలు మళ్ళీ ప్రాధేయపడింది. కండక్టరు కసురుకున్నాడు. ఏమేమో చెప్పుకుంటోంది. ఎవళ్ళకీ

పట్టలేదు. ఎవళ్ళగోలలో వాళ్లున్నారు. ఇన్స్పెక్టరు కాళ్లా వేళ్లా పడింది. ఏడుస్తుందేమిటి ? పిచ్చిదో ఏమో ! గోపాలరావునాయుడికి చిర్ర ఎత్తుకొచ్చింది. విదిలించి పారేశాడు. "ఛో వెధవముండా ! మళ్లీ బస్సులో జనాన్ని తొడతొక్కిడిగా ఎక్కించుకుంటున్నారు బాబోయ్ అంటూ అంతా గోలపెట్టేవాళ్లే! తీరా ఖాళీ లేదంటే ఒక్కడూ కదలడు."

"కనికరించు నాయన నాయన - అర్జంటుగా—."
మళ్లీ ప్రారంభించింది.

"ఏయ్ కండక్టర్ దీన్ని ఈడిచెయ్య."

అంత పనీ చేసేవాడే. ఇహా తప్పుకుంది. ఎవళ్ల తోవని వాళ్లు పోతున్నారు. అయిదు వందల నష్టం మాట అబద్ధమో ఏమో షావుకారు నిశ్చింతగా వెళ్లిపోతున్నాడు. పేదరాలు మూట నెత్తిని పెట్టుకుని కాలినడకని వెడదామనో ఏమో నీళ్ళల్లో ముందుకి సాగి పోయింది.

ఎలాగైతేనే ఘాటైన కిరసనాయిలు కంపూ బొగ్గు వాసనా తప్పనిసరిగా భరించి ముందు సీట్లో తన దర్జా నిలుపుకున్నాడు సబిన్స్పెక్టరు గోపాలరావు నాయుడు.

బస్సు ఊరుదాటే సరికి అంతా నీళ్లమయం. అలవాటుమీద రోడ్డు ఫలానా అని గుర్తుపెట్టుకుని డ్రైవరు జాగ్రత్తగా బస్సు నడుపుతున్నాడు. ఎండ మిటమిట లాడుతోంది. తుమ్మల అడివి నీళ్ళల్లో తేలి కనపడుతోంది. పండిన వరిమళ్లు కంకులు మాత్రం పైకి వేళ్లాడ వేశాయి. తెల్లని మబ్బులు నీళ్ళల్లో నీడలు చూచుకుంటున్నాయి. ఏటిపాయలలో నించి నీళ్లు పరవళ్లు తొక్కుతూ ఉరుకుతున్నాయి. జలజలమంటూ నీళ్ళని వొత్తిగించుకుని చక్రాలు ముందుకి సాగుతున్నాయి.

గోపాలరావునాయుడు పుట్టగుంట వంకకి వెడుతున్నాడూ అనగానే బస్సులో గుసగుసలు బయలుదేరాయి. నాయుడు అత్తగారి వూరది. ఆ ప్రాంతాలలో నాయుడు నెరగని వాళ్లెవరూ లేరు. ఆయన భార్యని వొదిలిపెట్టి ఎనిమిదేళ్లు కావస్తోంది. అప్పుడు జమీందారుగారి అబ్బాయి అనీ పెరటిగోడల మీదనించి ప్రేమలేఖలనీ గోడల మీద మసిబొగ్గు రాతలతో అర్థంకాని ఆకాశరామన్న వుత్తరాలతో ఏదో పెద్దపుకారు పుట్టింది ఆవిడమీద. నాయుడు స్వతహా మహాకోపిష్టి మనిషి. ముందూ వెనకా ఆలోచించకండా తక్షణం ఓ రాత్రి భార్యని

కట్టుగుడ్డలతో వెళ్ళగొట్టాడు. ఆ చుట్టుపక్కలగాని మళ్ళీ అవుపిస్తే పిస్తోలుతో పేల్చేస్తానన్నాడు. వెళ్ళగొట్టిన మూడు నెలలకే నిజం నిలకడగా తెలిసి వొచ్చింది. ఆ వుత్తరాలన్నీ ఇంటివెనకవున్న డాక్టరమ్మకీ, పక్కనిమేడలో వుంటున్న కాలేజివిద్యార్థికీ దాసి చుక్కమ్మ ద్వారా జరుగుతున్న ప్రణయకాండ అని తేలింది చివరికి. తొందరపడ్డాననుకున్నాడు. ఎంత వెదికించినా ఆచోకీ దొరకలేదు.

నాయుడు కొడుకు శ్యాము పుట్టగుంటలో అమ్మమ్మగారి ఇంటివద్ద పెరుగుతున్నాడు. శ్యాము ఎందుచేతనో తల్లిమీద విపరీతంగా బెంగపెట్టుకున్నాడు. మరిపించడానికి ఎవరికీ సాధ్యం కాలేదు. మనోవ్యాధితో మంచమెక్కి అయిదారునెలలు కావస్తోంది. గోపాలరావు నాయుడికి ఆ వేళ ఉదయమే టెలిగ్రాం వచ్చింది, కుర్రవాడు చాలా సీరస స్తితిలో వున్నాడనీ అర్జంటుగా రమ్మనమనీ.

చంద్రంపాలెం వంతెన దగ్గర సబిన్స్పెక్టరు బస్సు దిగగానే సారాబు[illegible] పాట ఎప్పుడుపాడుకుందామా అని రెపరెపలాడుతున్న కండక్టరుకి కొండంత బరువు దించేసినట్టయింది.

నాయుడు పుంత దారిని ఇసకలో నడిచి వెడుతున్నాడు ఊళ్ళోకి. ఎనిమిదేళ్ళక్రితం ఆ పంటకాలవ మలుపులోనూ, పొలాలగట్లమ్మటా రాజ్యంతో ఉల్లాసంగా తిరుగుతుంటే కంచెలమీద బ్రహ్మదండ పువ్వులకనీ, కట్టవపక్కని విచ్చిన మొగలిపొత్తులకనీ శ్యాము పోరుపెట్టిన రోజులు మళ్ళీ బాధపెట్టాయి.

ఇంటో అంతా ఖంగారు పడుతున్నారు. గోపాలరావునాయుడు మంచంపట్టీ ఆనుకుని కూచున్నాడు. మనోవ్యాధి అంటాడు డాక్టరు. రాత్రి పడింది.

"అమ్మ కావాలి." అని కలవరిస్తున్నాడు, శ్యాము. తండ్రి సముదాయిస్తున్నాడు.

"అమ్మాయి ఏలూళ్ళో వున్నదని నిన్నరాత్రి ఈ వూరి సుబ్బావధాన్లు కబురు తెచ్చాడు."

"ఎక్కడ?" ఖంగారు పడుతో అడిగాడు నాయుడు.

"సత్రంలో కనిపించిందట."

"మరి టెలిగ్రాము ఇవ్వలేకపోయినారా ?"

"ఉదయమే నీకిచ్చినప్పుడే ఇచ్చాము."

అయితే తను వచ్చిన బస్సుమీదనే వచ్చి వుండాలనే! అది తప్పితే మరి బస్సులేదుకూడా. ఒక

అనుమానం తగిలింది. ఇందాక బస్సుమీదనించీ దించేసిన వాళ్ళలోగాని లేదుగదా ?............... .........ఆడంగులెవళ్ళూ.........అన్నట్టు, కదిలేముందు కారు ఎక్కేందుకు గాబరాపడుతూ వచ్చిన ఆ పేదరాలెవరు ? తీవ్రంగా ఆలోచించి చూచుకున్నాడు. ఎనిదేళ్ళ మడతలలోనించి మరుపుల కిందనించీ తళుక్కున మెరిశాయి చిక్కిపోయి చివికిపోయి మారినా మరుపుకురాని ఆ పల్లె రూపురేఖలు. ఆమె తన భార్య !!! అయ్యయ్యో కన్నతల్లి ఆందోళన అది !! కనిపెట్టలేకపోయాడు !!! ఆసంగతి ఎవరితో చెప్పడానికీ అతనికి మొహంచెల్లలేదు. రాత్రి రెండుజాములవేళ శ్యాము కళ్ళుమూశాడు. సాయంత్రంవరకూ అంతా కనిపెట్టుకుని ఎదురు తెన్నులు చూస్తూ కూచున్నారు. ఎవ్వరూ రాలేదు.

మర్నాడు సబిన్స్పెక్టరు పోలీసుస్టేషనుకి వెళ్ళగానే క్రితంరోజు వరదలలో బుడమేరు దాటబోయి ప్రాణాలు విడిచిన ఒక అనాథశవం 'పోస్టుమార్టెం ఎగ్జామినేషన్' కని సిద్ధంగావుంది.

"తొందరపాటు"

[illegible] 15.11.2003